నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక

మెదక్

1

సోమవారం | 13 మే 2024 | www.navatelangana.com

ఫుట్ బాల్ విజేతలకు సీఎం అభినందనలు

నవతెలంగాణ-కొల్చారం



ఫుట్ బాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఆదివారం (హెచ్ సియూ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన ఇండియా టీం ఫుట్ బాల్ క్రీడాపోటీల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. క్రీడల్లో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన సోమన్నగారి లక్ష్మీ రవీందర్ రెడ్డిల కూతురు రచన ఫుట్బాల్ క్రీడలో విజేతగా నిలిచింది. ఆమె (హెచ్ సీ యూ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ మాస్టర్స్ ఫైనలీయర్ చదువుతున్నారు. ఇండియా టీం జట్టులో యూనివర్సిటీ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా స్టూడెంట్ రచనను సీఎం రేవంత్‌రెడ్డి అభినందిస్తూ బహుమతి అందజేశారు.

ఓటింగ్ సమాచారం త్వరిత గతిన అందించాలి

నవతెలంగాణ-మెదక్



పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమాచారం త్వరిత గతిన అందించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో సిబ్బందితో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం, ఓటర్ల హాజరు సమాచారం త్వరితగతిన ఉన్నతస్థాయి అధికారులకు అందించాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటర్ల హాజరు, పోలింగ్ శాతం అందించి పూర్తి సమాచారాన్ని ఆన్లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏవో యునస్, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్ సింగ్, ఈడియం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దున 7 నుంచి.. పోలింగ్ పొద్దుమికి 6 వరకు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	మహిళలు	పురుషులు	ఇతరులు
మెదక్	2124	1828210	902110	925891	209
జహీరాబాద్	1973	1640735	839113	801563	59

- పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం
- పీఎస్‌లకు చేరిన సిబ్బంది, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాడ్స్
- ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రక్రియ
- మెదక్‌లో 18.28 లక్షల ఓటర్లు.. 2124 పోలింగ్ కేంద్రాలు
- జహీరాబాద్‌లో 16.40 లక్షల ఓటర్లు...1973 పోలింగ్ కేంద్రాలు
- అంతటా 144 సెక్షన్.. భారీ బందోబస్త్ ఏర్పాటు
- సాయంత్రం 6 గంటలకు పీఎస్ ఆవరణలో ఉంటే ఓటింగ్‌కు ఛాన్స్

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం పొద్దున్నే 7 గంటలకు షురూ కానున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని గంట పాటు పెంచినందున పొద్దుమికి 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అప్పటిలోపే పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న వాళ్లందరితో రాత్రి సమయమైనా సరే ఓటింగ్‌లో పాల్గొనే అవకాశముంది. మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ కోసం సర్వం సిద్ధం చేశారు. ఆదివారమే పోలింగ్ సిబ్బంది పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన ఎన్నికల సామాగ్రిని తీసుకుని బయలుదేరి వచ్చారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్ ఇతర సామాగ్రితో ఎన్నికల సిబ్బంది పోలీస్ బందోబస్తులో పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో 18.28 లక్షల మంది, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 16.40 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సంగారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధం..



లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేశారు. మెదక్, జహీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు రాహుల్ రాజ్, క్రాంతి వల్లూరు ఆధ్వర్యంలో ఏర్పాటు పూర్తి చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రం నుంచి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు, మెదక్ జిల్లా కేంద్రం నుంచి మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రిని తరలించారు. ప్రొసీడింగ్, సహాయ ప్రొసీడింగ్, ఓపీఓలు ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రమే చేరుకున్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్లను విభజించారు. ఓటర్లకు అవసరమైన మంచి నీళ్లు, నీడ, కూర్చోవడానికి కుర్చీలు, వికలాంగులు, వృద్ధుల కోసం ర్యాంప్, విల్‌చైర్స్ ఏర్పాటు చేశారు. నడవలేని వాళ్లను పోలింగ్ కేంద్రం వరకు వాహనాల్లో తీసుకొచ్చేందుకు వీలుంటుంది. విద్యుత్ సదుపాయం కల్పించారు. కరెంట్ కోతల్లేకుండా విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేసింది.

పొద్దునే 7 గంటలకే పోలింగ్ షురూ..

పార్లమెంట్ ఎన్నికలు మండుటెండల్లో జరుగుతున్నందున కేంద్ర ఎన్నికల సంఘం సాయంత్రం పూట గంట సమయాన్ని పొడిగించింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటల వరకు కూడా పోలింగ్ నిర్వహిస్తారు. 6 గంటల సమయంలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వచ్చిన ఓటర్లతో రాత్రి వరకూ ఓట్లు వేయించాల్సి ఉంటుంది. ఉదయం పొద్దునే 5.30 తర్వాత కనీసం ఇద్దరు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్ పని విధానాన్ని పరీక్షించి ఒకే చెప్పాకనే ఓటర్లతో ఓట్లు వేయిస్తారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మోరాయించినా ఇతర సాంకేతిక కారణాలతో సతాయించినా వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం అదనపు ఈవీఎంలను సమ కూర్చారు. సాంకేతిక సమస్యలొస్తే సరిచేసేందుకు టెక్నికల్ టీమ్స్‌ను కూడా అందుబాటులో పెట్టారు.

భారీ బందోబస్త్..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈసీ భారీ బందో బస్త్‌ను ఏర్పాటు చేసింది. మెదక్, సంగారెడ్డి నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులైన ఆ జిల్లా కలెక్టర్లు క్రాంతివల్లూరు, రాహుల్ రాజ్‌ల ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు పెట్టారు. మెదక్, జహీరాబాద్ రెండు నియోజక వర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కొన్ని సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అక్కడ సెంట్రల్ ఫోర్స్‌ను బందో బస్త్ కోసం పెట్టారు. అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఏ నలు గురు గుమిగూడినా ఎన్నికల ఉల్లంఘన కింద అరెస్టు చేస్తారు. అల్లర్లు జరగకుండా చూడడమే కాకుండా పోలింగ్ సిబ్బంది, సామాగ్రి, ఈవీఎం తరలింపు కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలోని గీతం యూనివర్సిటికీ, మెదక్ లోని కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను చేర్చేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఆరు జిల్లాల పోలీస్ అధికారులతో పాటు కేంద్ర, రాష్ట్రం నుంచి వచ్చిన ప్రత్యేక పోలీస్ అధికారులు బందోబస్త్‌ను పర్యవేక్షిస్తున్నారు.

మెదక్‌లో 18.28 లక్షలు.. జహీరాబాద్‌లో 16.40 లక్షల ఓటర్లు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1828210 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 925891 మంది, మహిళలు 02110 మంది, ఇతరులు 209 మంది ఉన్నారు. జహీరాబాద్ పార్లమెంట నియోజకవర్గం పరిధిలో 1640735 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 801563 మంది, మహిళలు 839113 మంది, ఇతరులు 59 మంది ఉన్నారు. మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న మెదక్ నియోజకవర్గంలో 218631 మంది, నర్సాపూర్‌లో 227082 మంది, పటాన్‌చెరు 413097 మంది, సంగారెడ్డిలో 249738 మంది, దుబ్బాకలో 200185 మంది, సిద్దిపేటలో 237520 మంది, గజ్వేల్‌లో 280908 మంది ఓటర్లున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గంలో 1640735 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 801563 మంది, మహిళలు 839113 మంది, ఇతరులు 59 మంది ఓటర్లున్నారు. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 275562 మంది, అందోల్‌లో 250857 మంది, నారాయణఖేడ్‌లో 237241 మంది,



జుక్కల్‌లో 202769 మంది, ఎల్లారెడ్డిలో 223009 మంది, బాన్సువాడలో 196891 మంది కామారెడ్డిలో 254626 మంది ఓటర్లున్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలో 2124 పోలింగ్ కేంద్రాలు, జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో 1973 పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను బట్టి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాడ్స్‌ను ఏర్పాటు చేశారు. మెదక్ నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసేందుకు మూడు బ్యాలెట్ యూనిట్లను చూసి ఓటు వేయాల్సి వస్తుంది. దీంతో పోలింగ్ ప్రక్రియ స్లోగా సాగే అవకాశంలేకపోలేదు.

అందరూ ఓటేయడం కనీసం బాధ్యత: క్రాంతి వల్లూరు, రాహుల్ రాజ్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించడం కనీస బాధ్యత అని జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతివల్లూరు, మెదక్ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ అన్నారు. మే 13న వేతనంతో కూడిన సెలవు ప్రకటించినందున వేతన జీవులందరూ విధిగా పోలింగ్‌లో పాల్గొనాలని కోరారు. మిగతా ఓటర్లు తప్పకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలి కోరారు. పోలింగ్ ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. నిబంధనల్ని ఉల్లఘిస్తే ఎవర్నీ ఉపేక్షించేది ఉండదని హెచ్చరించారు.

నియోజకవర్గాలు	పోలింగ్ కేంద్రాలు	మొత్తంఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
మెదక్	277	218631	114813	103818	4
నర్సాపూర్	307	227082	116898	110184	6
సంగారెడ్డి	281	249738	126567	123171	37
పటాన్‌చెరు	411	413097	200080	213017	86
దుబ్బాక	253	200185	102927	97198	0
సిద్దిపేట	273	237520	121084	116436	71
గజ్వేల్	322	280908	142722	138186	5

నియోజకవర్గాలు	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
జహీరాబాద్	313	275562	137694	137866	2
అందోల్	313	250857	122666	128186	5
నారాయణఖేడ్	298	237241	118859	118373	9
జుక్కల్	255	202769	99474	103288	9
ఎల్లారెడ్డి	270	223009	106876	116131	2
బాన్సువాడ	258	196891	93688	102990	13
కామారెడ్డి	266	254626	122300	132301	19

లోక్ సభ ఎన్నికలకు ఈవీఎంలతో సిబ్బంది సిద్ధం

నవతెలంగాణ-వెల్దుర్తి



లోక్ సభ ఎన్నికలకు ఈవీఎంలతో సిబ్బంది ఆదివారం వెల్దుర్తి మండలానికి తరలివచ్చినట్లు వెల్దుర్తి స్పెషల్ అధికారి తహశీల్దార్ తెలిపారు ఓటర్లకు వికలాంగులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఎస్ఐ నవతా తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రెండు వందల మీటర్ల దూరంలో ఓటర్లు ఉండాలనే నిబంధన మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది ముగ్గును పోసి ఏర్పాట్లు చేశారు. తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు.

డబ్బులు పంచుతున్నారని బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఘర్షణ

నవతెలంగాణ-రాయపోల్



ఎన్నికల సమీపిస్తున్న వేళ ఓటర్ల ప్రభావితం చేయడానికి రాజకీయ పార్టీలు వివిధ ప్రయత్నాలు చేస్తున్నాయని తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 13న జరిగే లోక్ సభ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సర్వం సిద్ధం చేశారు. మరికొద్ది గంటలలో ఎన్నికలు ప్రారంభమవుతుండగా ఓటర్లను ప్రభావితం చేయడానికి పార్టీలు ఎవరి ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ వర్గాలు ఘర్షణకు దిగారు. బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టడానికి అధిక మొత్తంలో డబ్బులను తరలించి ఆ డబ్బును ఓటర్లకు పంచి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని బిఆర్ఎస్ నాయకులపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేశారు. రాయపోల్ మండలం తిమ్మక్ పల్లి గ్రామ శివారులో ఆదివారం ఓ ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ నాయకులు అధిక మొత్తంలో డబ్బులు దాచారని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆరోపించి అక్కడ చేరుకొని బీఆర్ఎస్ నాయకులతో ఘర్షణకు దిగారు. దీనితో అక్కడ ఒకరినొకరు ఆరోపణలు చేసుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మాట మాట పెరిగి ఒకరినొకరు తోసుకున్నారు. గొడవ తీవ్రంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అక్కడికి చేరుకున్న రాయపోల్ ఎస్సై రఘుపతి కి బిజెపి, కాంగ్రెస్ నాయకులు ఆ ఫామ్ హౌస్ లో డబ్బులు దాచారని సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఫామ్ హౌస్ మొత్తం వెతికారు. ఎక్కడ డబ్బు ఆచూకీ లభించలేదు. అయినప్పటికీ పరిస్థితులలో మార్పు రాకపోవడంతో తొగుట సిఐ లతీఫ్, దౌల్తాబాద్, తొగుట ఎస్సైలు అక్కడికి చేరుకొని ఆయా పార్టీల కార్యకర్తలను నచ్చజెప్పి అక్కడ నుండి పంపించేశారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు నాయకులు కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నేడు చింతమడకకు మాజీ సీఎం రాక

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్



లోక్ సభ ఎన్నికల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక గ్రామంలో హైస్కూల్లో ఏర్పాటు చేసిన 13వ బూతు నెంబర్లు తమ ఓటు హక్కును కుటుంబ సమేతంగా వినియోగించుకుంటారని మాజీ సర్పంచ్ హంసకేతన్ రెడ్డి తెలిపారు. హేలీప్యాడ్ స్థలాన్ని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. ఎంపిటిసి జ్యోతి దేవేందర్ ఉపసర్పంచ్ మోత్కు రవి నాయకులు పాల్గొన్నారు.

డబ్బులు పంచుతున్న వ్యక్తిపై కేసు

నవతెలంగాణ- దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట వార్డులో ఓటర్లకు డబ్బులు పంచుతున్నాడన్న బీజేపీ నాయకుల సమాచారంతో బీఆర్ఎస్ కార్యకర్త దివిటి సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.గంగరాజు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దుబ్బాక ఎఫ్ఎస్ టీ టీమ్, దుబ్బాక పోలీసులు అక్కడికి వెళ్లి సాయికుమార్‌ను పట్టుకొని తనిఖీ చేయగా అతని వద్ద రూ.11,500 లు, ఓటర్ల పేర్లతో గల చీటీ లభ్యమయ్యాయి. దుబ్బాక ఎఫ్ఎస్ టీ టీం ఇన్చార్జి నరేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. మరొక ఘటనలో పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ వార్డులో ఇద్దరు బీఆర్ఎస్ నాయకుల ఇంట్లో మద్యం ఉందని ఇచ్చిన సమాచారం ఆధారంగా దుబ్బాక ఎఫ్ఎస్ టీ టీం, పోలీసులు వెళ్లి ఆ ఇద్దరి ఇండ్లలో తనిఖీ చేయగా అక్కడ ఎలాంటి మద్యం లభ్యం కాలేదన్నారు.

24 గంటలు పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

రాబోయే 24 గంటలు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెదక్ లోక్ సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన సిద్దిపేట పట్టణంలోని అంబిటాస్ స్కూల్ పోలింగ్ కేంద్రాన్ని, చిన్నకోడూరు మండల కేంద్రంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు వేయడానికి జిల్లా యంత్రాంగంతో కలిసి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. జిల్లా బోర్డర్ చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, డబ్బు మద్యం పంపిణీ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ లక్ష్మీ బాబు, రూరల్ సీఐ శ్రీను, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, ఆర్ఎస్ఐ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాన్గల్ శివారులో స్ప్రైట్, థమ్సప్ బాటిల్లు స్వాధీనం

నవతెలంగాణ-తొగుట



మద్యం, డబ్బు, కూల్ డ్రింక్ బాటిల్స్ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాను సారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి. లింగం తెలిపారు. ఆదివారం తొగుట పోలీస్ స్టేష న్ పరిధిలోని కాన్గల్ గ్రామ శివారులో చింతమడక శ్రీధర్, తన వ్యవసాయ పొలం వద్ద ఒక షెడ్డులో అక్రమంగా స్ప్రైట్, థమ్సప్ బాటిల్లు దాచి పెట్టా రు. విషయం తెలుసుకున్న పోలీసులు నమ్మదగి న సమాచారంతో ఎస్ఐ, మండల్ (ఎఫ్ఎస్టి) ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారులు, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. షెడ్డులో ఓటర్లకు పంపిణీ చేయడానికి దాచిపెట్టిన స్ప్రైట్, థమ్సప్ బాటిల్లు 1.25 లీటర్లు కలవి 660 బాటిల్లు మొత్తం విలువ రూ. 38,940 వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఓట ర్లకు పంపిణీ చేయడానికి ప్రయత్నించిన వెంటనే ఎలక్షన్ సెల్ టోల్ ఫ్రీ నెంబర్ 1950, సిద్దిపేట పోలీ స్ కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సూచించారు. స్ప్రైట్, థమ్సప్ బాటిల్లు స్వాధీనం చేసుకుని కేసు నమో దు చేసి పరిశోధన ప్రారంభించామని తెలిపారు.

ప్లాస్టిక్ పేపర్ ప్లేట్ వద్దు - మోదుగ ఆకుల విస్తరాకుల ప్లేట్ ముద్దు

నవతెలంగాణ-మద్దూరు



ప్లాస్టిక్ పేపర్లు వద్దు మోదుగ ఆకుల విస్తరాకుల ప్లేట్లు ముద్దు అని రేబర్తి పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో మోదుగు ఆకుల విస్తారాకులపై ప్రజలకు అవగాహన కల్పించి మోదుగు ఆకుల విస్తారాకులలో అల్పాహారం వడ్డించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుటకు స్వయం సహాయక సంఘాలు మహిళల తో గ్రామపంచాయతీ వద్ద మోదుగ ఆకుల తో విస్తారాకులు చేయించినట్లు ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి గ్రామ మహిళ లకు అవగాహన కనిపించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్యస్వయం సహాయక సంఘాలు సిపిలు జయమ్మ, సబితా, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, నిర్మల, అనురాధ, ఆశ కార్యకర్తలు కవిత, కనక లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

పారదర్శకంగా పోలింగ్ చేపట్టాలి..

- పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి
- సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ పొడగింపు
- జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్
- ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పరిశీలన



నవతెలంగాణ-మెదక్

ఎన్నికల నిబంధనల మేరకు పారదర్శకంగా పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బందిదే అని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ ను నిర్వహించాలని చెప్పారు. ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలన్నారు. ఉదయం 7 గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేదించాలన్నారు. ఈవిఎంలకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా, ఏమైనా సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలన్నారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని, ఎన్నికల సామాగ్రి పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో వేసే ఓటు భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నియోజవర్గాల కేంద్రంలోని పంపిణీ కేంద్రం నుండి ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఒపివోలు 277 పోలింగ్ కేంద్రాలలో 28 రూట్లలో (61) బస్సుల ద్వారా 1280 మంది పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామాగ్రితో తరలి వెళ్లడం జరిగిందని తెలిపారు. ప్రజలకు తమ ఓటు హక్కు వినియోగం పై సూచనలు సలహాలు ఇస్తూ నిర్భయంగా నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సీనియర్ సిటిజన్స్ కు, పిడబ్ల్యుడి ఓటర్స్ కు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్స్ అందుబాటులో ఉంటాయని వినియోగించుకోవచ్చని వివరించారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి డబ్బు గాని మద్యం గాని పంపిణీ చేసినట్లు ఏమైనా ఫిర్యాదులు అందినట్లయితే ఎన్నికల నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రజలందరూ సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రశాంత ,పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ రమాదేవి డి. ఎస్. పి రాజేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ,తహసీల్దారులు, పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం

ఎంఎస్ఎస్ఓ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-నిజాంపేట



మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఎం ఎస్ ఎస్ ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి ఉందని 6 గ్యారంటీలలో 5 గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని దేశం కోసం తన కుటుంబం ప్రాణాలను అర్పించిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కుంభకోణాలలో కూరుకుపోయిందన్నారు. కల్వకుంట్ల కుటుంబం వేలకోట్లు తెలంగాణ ప్రజల సొమ్మేనని, తెలంగాణ ప్రజలకు మాయ మాటలు చెప్పి కలిబొల్లి కథలు చెప్పి వేల కోట్లు సంపాదించారన్నారు. కేసీఆర్‌కు హెలి కాప్టర్ ఎక్కడి నుంచి వచ్చిందన్నారు. కేటీఆర్ బర్రే నాడు అంబులెన్సును తెలంగాణ ప్రజలకు అందజేస్తున్నానని చెప్పి ఆ సొమ్ము ఎక్కడిది అని ప్రశ్నిం చారు. బీజేపీ ప్రభు త్వం అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రిజర్వే షన్లు రద్దు చేస్తామంటుందని అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడుతున్నారన్నారు. ప్రధాన మంత్రి మోడీ దేశ సంపదను పూర్తిగా గుజరాతీయులకు దోచిపెడుతున్నాడని అత్యధి కంగా బ్యాంకులను లూటీ చేసిం ది మోడీ మిత్రులేనన్నారు. అందుకే మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు బహుజన బిడ్డను రెండు లక్షల మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలోని ఓ మూతబడిన వాటర్ ప్లాంట్ వద్ద 74 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంపేట ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మండలంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ తెస్తాం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్

నవతెలంగాణ-కౌడిపల్లి



కౌడిపల్లి మండలం నుంచి బీఆర్ఎస్‌కు 5 వేల మెజార్టీ తెస్తామని మండల పార్టీ అధ్యక్షుడు రామా గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకర లతో మాట్లాడుతూ మెదక్ బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి మండలం నుంచి ఐదువేల మెజార్టీ ఇస్తామని ఆయన తెలిపారు. గత పది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కరెంటు కోతలు రైతుల ఆత్మహత్యలు జరిగాయని ఆయన అన్నారు. కేసీఆర్ ముఖ్య మంత్రిగా పని చేసిన సమయ ంలో కొత్త కొత్త పథకాలను పెట్టి ప్రజలకు అందజేశారని ఆయన తెలిపారు. మండలంలో బీఆర్ఎ స్ మాజీ సర్పంచ్లు ఎంపిటిసిలు వార్డు మెంబర్లు కార్యకర్తలు ప్రతి ఇంటింటికి ప్రచారం చేసి కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

నవతెలంగాణ-నార్సింగి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన నార్సింగి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం నార్సింగి తాజా మాజీ ఉప సర్పంచ్ కాలేరు యోగికి పట్టణ కేంద్రానికి చెందిన కూరాకుల పుష్ప ఫోన్ చేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో గల గణేష్ నగర్ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉందని తెలిపారు. విషయాన్ని యోగి నార్సింగి ఎస్ఐకి తెలుపగా ఎస్ఐ తన సిబ్బందితో మృత దేహం ఉన్న చోటుకు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. చనిపోయిన వ్యక్తికి మతి స్థిమితం లేదని, గత ఏడెనిమిది ఎని మిది రోజుల నుంచి రోజుల నుంచి పరిసర ప్రాంతంలో ఒంటి పై డ్రాయర్ మాత్రమే వేసుకుని, డ్యాన్సులు చేసుకుంటూ తిరుగుతున్నట్లు తెలిసిందని అన్నా రు. చనిపోయిన వ్యక్తికి నెత్తి పై వెంట్రుకలు మొత్తం తీసివేసి, పిలక మాత్రం ఉందని, ఏడు వరసల మొలతాడు, ఎరుపు రంగు "మాచో" కంపెనీ డ్రాయర్, కుడి చేతికి స్టీల్ చైన్, "సంతోష్ ఎం" అని హిందీ భాష లో పచ్చ బొట్టు, ఎడమ చేతి, ఎడమ ఛాతి పై 'బీ' అని, ఏదో గుర్తు గల పచ్చ బొట్టు ఉందని, ఎడమ కాలి పై నల్ల దార ం కట్టి ఉందని, వయస్సు 40 నుంచి 50 సం వరకు, ఎత్తు 5'2 వర కు ఉంటు ందని వెల్లడించారు. అనారోగ్య కారణాల తో మృతి చెందినట్లు అంచనా వేస్తున్నామని, మృతుని ఆచూకీ తెలిసిన వారు నార్సింగి పోలీస్ లకి సంప్రదించా లనా న్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల కేంద్రాలకు ఈవీఎంలతో పోలింగ్ ఆఫీసర్లు..

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని 13 పంచాయతీల్లో ఏర్పాటుచేసిన ఎన్నికల కేంద్రాలకు ఈవీఎంలతో పోలింగ్ ఆఫీసర్లు ఆదివారం చేరుకున్నారు. పోలీస్ అధికారులు వారికి పగడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలింగ్ కేంద్రాలను సందర్శించిన విద్యుత్ శాఖ సీజీఎం

నవతెలంగాణ-గుమ్మడిదల

పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ రూరల్ చీఫ్ జనరల్ మేనేజర్ బిక్షపతి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గుమ్మడిదల సబ్ డివిజన్ పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఏడీఈ. శ్రీకాంత్‌కు సూచించారు. మండల పరిధిలోని అన్నారం గ్రామం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. జిన్నారం ఏఈ రాజు నాయక్, బొంతపల్లి ఏఈ రవీందర్ విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పరిశ్రమలు ఫుల్..
ఫైర్ స్టేషన్స్ నిల్

- పారిశ్రామిక ప్రాంతమైన ఉమ్మడి జిన్నారం మండలంలో ఒక్క ఫైర్ స్టేషన్ లేకపోవడం గమనార్హం
- ఏదైనా ప్రమాదం జరిగితే హైదరాబాద్ నుంచి ఫైర్ ఇంజన్లు రావాల్సిన దుస్థితి
- వెరసి పెరుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టం
- స్థానికంగా ఫైర్ స్టేషన్ ఉంటే నష్టం తగ్గే అవకాశం
- వెంటనే ఏర్పాటు చేయాలి
- కార్మికులు, పారిశ్రామిక వర్గాల విజ్ఞప్తి

పారిశ్రామిక ప్రాంతమైన జిన్నారం ఉమ్మడి మండలంలో వందల కొద్ది పరిశ్రమలు వెలిశాయి. వేలాది మంది కార్మికులు ఈ పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమల్లో ప్రతినిత్యం పారిశ్రామిక ఉత్పత్తులకు సంబం ధించిన కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగుతూనే ఉంటాయి. కానీ ఇన్ని పరిశ్రమలు ఉన్నప్పటికీ.. ఈ ప్రాంత ంలో ఒక్క ఫైర్ స్టేషన్ కూడా లేకపోవడం గమనార్హం. దాంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే.. దూరం నుంచి ఫైర్ స్టేషన్‌లు రావాల్సి ఉండడంతో ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా జరుగుతున్నది. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయట్లేదు. తమ ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు వాపోతున్నారు.



నవతెలంగాణ-జిన్నారం

ఉమ్మడి మెదక్ జిల్లా.. రాష్ట్ర రాజధాని నగరమైన హైదరాబాద్‌కు చేరువలోనే ఉండడంతో జిన్నారం మండలానికి 1980వ దశకం ద్వితీయార్ధంలో పరిశ్రమల ఏర్పాటుకై అంకురార్పణ జరిగింది. ఈ నేపథ్యంలోని వివిధ ప్రాంతాలు పారిశ్రామిక వాడలుగా రూపుదిద్దుకున్నాయి. ఉమ్మడి జిన్నారం మండల పరిధిలోని బొల్లారం, గడ్డపోతారం, చెట్లపోతారం, కాజిపల్లి, అలీ నగర్, బొంతపల్లి, మంబాపూర్, అన్నారం, దోమడుగు, కానుకుంట, అనంతారం వావిలాల ప్రాంతాలుగా పారిశ్రామిక వాడలుగా తమ తమ కార్యాకలాపాల నేపథ్యంలో ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ప్రధానంగా రసాయన, స్టీలు, ఇతర ఇతర పరిశ్రమలు పెద్ద మొత్తంలో ఇక్కడ వెలిసాయి.

అగ్నిమాపక కేంద్రం లేక అవస్థలెన్నో?

ఉమ్మడి జిన్నారం మండలంలో అగ్నిమాపకకేంద్రం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని పారిశ్రామిక రంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇక్కడ రసాయన పరిశ్రమలు పెద్ద మొత్తంలో ఉండడంతో.. వివిధ పారిశ్రామిక వాడల్లో కొన్ని సందర్భాలలో పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫలితంగా ప్రాణనష్టం, ఆస్తి నష్టం లాంటివి పరిపాటిగా మారాయి. అయితే ఈ ప్రమాదాలు జరిగినప్పుడు స్థానికంగా ఫైర్ స్టేషన్ ఉంటే నష్టం ఎక్కువగా జరగబోదని.. దూరం నుంచి ఫైర్ ఇంజిన్లు రావాలంటే సమయం పడుతుండడంతో నష్టం ఎక్కువగా జరుగుతున్నదని వాపోతున్నారు. గడిచిన కొన్నేండ్ల కాలం లో పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయంటూ పారిశ్రామిక రంగం చెబుతోంది. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు జరిగి దశాబ్దాలు గడుస్తున్నా.. అధికారులు ఫైర్ స్టేసేన్ ఏర్పాటులో మీనమేషాలు లెక్కిస్తుండడం సరికాదని పరిశ్రమల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

యాజమాన్యాలే చొరవ చూపాలి..

స్థానికంగా ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ఉమ్మడి జిన్నారం మండలం పారిశ్రామిక యాజమాన్యాలే ప్రత్యేకంగా చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుతో ఇటు పారిశ్రామిక యాజమాన్యాలకు, అటు కార్మిక లోకానికి ఎంతో మేలుగా ఉంటుందంటున్నారు.

అధికారులు మా సమస్యను ఆలకించండి..

స్థానికంగా ఏదైనా ప్రమాదం జరిగితే హైదరాబాద్ నగరంలోని జీడిమెట్ల, సనత్‌నగర్, సంగారెడ్డి, లాంటి ప్రాంతాల నుంచి ఫైర్ స్టేషన్‌లు రావాల్సిన పరిస్థితి నెలకొన్నదని.. దాంతో తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని కార్మికులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సంబంధించి అనేక సందర్భాల్లో అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశ్రామిక వాడల పరిశ్రమలను కార్మికులను దృష్టిలో పెట్టుకొని వెంటనే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం

మాజీ శాసనమండలి చైర్మన్ భూపాల్ రెడ్డి

నవతెలంగాణ-రామచంద్రాపురం

మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి భారీ మెజార్టీ విజయం సాధిస్తారని రాష్ట్ర మాజీ శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్ రెడ్డి నివాసంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. గత పదేండ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి కలెక్టర్‌గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి పరిచారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. విద్యావంతుడైన వెంకట్రామిరెడ్డిని లోకసభకు పంపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వెంకట్రామిరెడ్డి ఎన్నికల్లో గెలవడం ఖాయమని కానీ భారీ మెజార్టీ తీసుకుని వచ్చే విధంగా కార్యకర్తలు నాయకులు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య యాదవ్, ఆదర్శ్ రెడ్డి, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ బిక్షపతి ఆదివారం ప్రత్యేకంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్ల విషయం గురించి వాకబు చేశారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలు, బొల్లారం మున్సిపల్ పరిధిలో మొత్తం మండల వ్యాప్తంగా 60 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా మొత్తం 59,327 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కాగా ఇంటింటికి ఓటర్లకు సంబంధించి బీఎల్ఓ బృందాలు ఓటర్ స్లిప్పులు కరెక్ట్‌గా పంపిణీ చేశారా లేదా అనే అంశాలపై తహసీల్దార్ బిక్షపతి ఆదివారం ప్రత్యేకంగా పరిశీలించారు.

నేడే పోలింగ్..

జిన్నారం మండల వ్యాప్తంగా అధికార యంత్రం నేడు(సోమవారం) జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోండి..

ఈ పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కును పొందిన ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని.. ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.



బి.బి పాటిల్ హయాంలోనే అభివృద్ధి

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీ.బీ పాటిల్ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఎంపీటీసీ డిశెట్టి పాటిల్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గత పదేండ్లలో కరోన మహమ్మారి కాలం నిధులు మినహా ఎంపీ ల్యాడ్స్ కింద వచ్చిన రూ.60 కోట్లు అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రాధాన్య క్రమంలో ఖర్చు చేశారన్నారు. ఎన్నికల నియమావళి ప్రకటన ముందు గత రెండు నెలల క్రితం జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో మెరుగైన లైటింగ్ కోసం హైమాస్ట్ లైట్లను పెట్టించడంతో పాటు కొన్ని పాత స్తంభాలను మరమ్మతు చేయించారన్నారు. జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో అమృత్ స్టేషన్ కింద రూ.26 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నా యన్నారు. ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో జాతీయ రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.12 వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి ఖర్చు చేశారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాలు మరింత అభివృద్ధి చేసుకొనేందుకు కేంద్రంలో అధికార బీజేపీ పార్టీలో చేరారని.. గత పదేండ్లలో చేసిన అభివృద్ధిని గుర్తించి బి.బి పాటిల్‌ను మరోమారు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధికార ప్రతినిధి విరేశ్ మడుపతి, పట్టణ బీజేపీ కోశాధికారి మఠం చంద్రశేఖర్ స్వామి, రవికాంత్ గోపన్ పల్లి, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోండి



నవతెలంగాణ-మనూర్

నేడు జరిగే లోకసభ ఎన్నికల్లో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు మంచి చేశాయి.. ఏ నాయకుడు అభివృద్ధి చేస్తాడో ఆలోచించి మంచి నాయకుడిని ఎన్నుకోలని బీరధార్ దత్తు అన్నారు. బి.బి పాటిల్ గత పదేండ్లుగా ఎంపీగా ఉండి ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. సురేష్ షెట్కర్ ఎంపీగా ఉన్నప్పుడే భోదన్ నుంచి బీదర్‌కు రైల్వే లైన్లు మంజూరు అయ్యాయన్నారు. నిజాంపేట నుంచి బీదర్ రోడ్డును జాతీయ రహదారిగా చేశారన్నారు. కాబట్టి అభివృద్ధికి పాటుపడే సురేష్ షెట్కర్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకం కాబట్టి.. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

అందోల్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్..

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ, పీఏసీఎస్ డైరెక్టర్, ఎంపీటీసీ



నవతెలంగాణ-జోగిపేట

పార్లమెంటు ఎన్నికల వేళ అందోల్ మండలంలో బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ మధ్య కాలంలో ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఒక్కొక్కరు పార్టీని వీడుతూ.. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సంగారెడ్డిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాసంలో అందోల్ మండల వైస్ ఎంపీపీ పట్లోళ్ల మహేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, రామసాంపల్లి ఎంపీటీసీ గజేందర్ రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ కృష్ణ గౌడ్, బీఆర్ఎస్ మండల నాయకులు పట్లోళ్ల భూపాల్ రెడ్డి, పట్లోళ్ల రాజశేఖర్ రెడ్డి, జోగిపేట మైనారిటీ నాయకులు అబ్దుల్ హుస్సేన్, తోపాటు సంగంపేట, కొండారెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెంది న బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ గెలుపు నకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మంత్రి సూచించారు. వచ్చే రెండేళ్ల లో ఆందోల్ నియోజకవర్గ రూపు రేఖలను మా రుస్తామన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పి స్తామన్నారు. కాంగ్రెస్‌పేదల సంక్షేమానికి అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి,నరేందర్,కృష్ణారెడ్డి, పృథ్వీరెడ్డితదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

2,400 మంది రాష్ట, కేంద్ర బాలగాలతో పటిష్ట బందోబస్తు : ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

నేటి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి 2,400 మంది కేంద్ర, రాష్ట్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్ల ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసీవింగ్ సెంటర్‌ల నుంచి ఈవీఎంలు వివిధ పోల్లింగ్ సెంటర్లకు వెళ్లనున్న సందర్భంగా సంగారెడ్డి డీఆర్‌సీ సెంటర్, అంబేద్కర్ స్టేడియం, పటాన్చెరు డీఆర్‌సీ సెంటర్, శ్రీ చైతన్య కాలేజ్ రుద్రారం, అందోల్ డి ఆర్ సి సెంటర్, జే ఎన్ టి యు లను ఎస్పీ ప్రత్యక్షంగా సందర్శించారు. ఈవీఎంలతో పాటు ఎన్నికల విధులకు హాజరవుతున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ ఇస్తూ ఎన్నికల విధులలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగటానికి అవకాశమున్న వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎట్టి పరిస్థితులల్లోనూ పోలింగ్ అధికారి అనుమతి లేనిది పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లారాదని సిబ్బందికి సూచించారు. రూట్ మొబైలు అధికారులు తమతమ ఏరియాలో గల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతరం పెట్రోలింగ్ చేయాలని సూచించారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు




నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈవీఎంల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 313 పోలింగ్ కేంద్రాలు అందుకు 313 పోలింగ్ ఆఫీసర్లు 313 అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు ,626 ఓపిఓలు 58లను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే ఏ విధమైనటువంటి టెక్నికల్ అంశాలను పోలింగ్ ఆఫీసర్లకు రూట్ అధికారులకు వివరించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని కట్టుదిట్టమైన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందోల్‌లో ఏ పార్టీకి లాభం చేకూరేనో?

- బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటాపోటీ
- అందోల్‌లో 2.50 లక్షల మంది ఓటర్లు



నవతెలంగాణ-జోగిపేట

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అందోల్ నియోజకవర్గంలో ఎన్నికల సమరంలో ఆయా పార్టీలు తమ సత్తా ఏమిటో నిరూపించుకునే పనిలో పడ్డాయి. నేడు ఎన్నికలు జరగనుండడంతో ఆయా పార్టీలు సైలెంట్ ఓట్లపై నజర్ పెట్టాయి. నియోజకవర్గంలో మొత్తం ఓట్ల సంఖ్య 2,50,887 ఉన్నాయి. జహీరాబాద్ పార్లమెంటులో కామారెడ్డి జిల్లా పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్స్‌వాడ, సంగారెడ్డి జిల్లా పరిధిలోని అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. 2009లో పార్లమెంటు ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ సుమారుగా 17వేల పైచిలుకు ఓట్లతో సమీప టీడీపీ అభ్యర్థి యూసఫ్ ఆలీపై విజయం సాధించారు. 2014, 2019లో జరిగిన వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున బీబీ పాటిల్ ఎంపీగా గెలుపొందారు. 2014లో లక్ష మెజార్టీ పైగా ఓట్లు సాధించారు.2019లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు పైన కేవలం 6000 మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో తమ సత్తా చాటడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. మూడు పార్టీల మధ్య కొనసాగుతున్న ఆసక్తికరమైన పోరులో విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. వ్యాపారవేత్తగా ఉన్న భీంరావు బస్వంత్‌రావు పాటిల్ (బీబీపాటిల్) ఒక్కరోజులోనే బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరి ఎంపీ టికెట్ తెచ్చుకున్నారు. బీఆర్ఎస్ నుంచి గాలి అనీల్‌కుమార్ జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ మూడో సారి పోటీ చేస్తున్నారు. 2009లో ఎంపీగా గెలుపొందిన ఆయన 2014 ఎన్నికల్లో ఓటమి చెందారు. రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, బీజేపీ తరపున బీబీ పాటిల్ తో పాటు అగ్ర నాయకులు తమ ప్రచారాలు చేపట్టారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-కొండాపూర్



కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కొండాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు గౌరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు జరిగే పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్, మెదక్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని కావున ప్రజలందరూ ఏకతా టిపై చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
సిద్దిపేట
సోమవారం | 13 మే 2024 | www.navatelangana.com

సెక్యులర్ పార్టీ బీఆర్ఎస్‌కే అండ



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ క్రైస్తవ సమాజం మొత్తం సెక్యులర్ పార్టీ అయిన బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని తెలంగాణ గాడ్ విజన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నెలమల్లి సికిందర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం 'నవతెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తరపున తెలంగాణ అంతట క్రైస్తవ సమాజంలో ప్రచారం చేయడం జరిగిందన్నారు. ఆ విషయం రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్‌కి ఒక నివేదిక సమర్పించినట్లు తెలిపారు. సిద్దిపేట బస్సు యాత్ర సందర్భంగా ఆయనను బస్సులో కలసి మాట్లాడినట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గత పది సంవత్సరాలుగా క్రైస్తవ సమాజం శాంతిగా, సంతోషంగా, సురక్షితంగా ఉన్నారన్నారు. క్రిస్టమస్ పండుగ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. తెలంగాణ క్రైస్తవ పాస్టర్లు, క్రైస్తవులు అందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గత ప్రభుత్వంలోనే గజ్వేల్ అభివృద్ధి

నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ యాదగిరి



నవతెలంగాణ-గజ్వేల్

గత ప్రభుత్వంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి పనులను చేపట్టినట్లు వర్గల్ మండలం నాచారం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ఆదివారం పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు నేతృతంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పినట్లు ఆయన అన్నారు. బిజెపితో ఒరిగేదేమీ లేదని కేంద్రంలో బీజేపీ వచ్చే అవకాశం లేదన్నారు. ప్రజలు కేసీఆర్ వైపు ఉన్నారని ఆయన అన్నారు. అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యమన్నారు. కరువు కాటకాలు తెలంగాణ రాష్ట్రం ఐదు నెలల్లో రైతులు ప్రజలు నష్టపోయినట్లు ఆయన చెప్పారు. కేసీఆర్ రాష్ట్రం సాధించకపోతే రేవంత్ రెడ్డి సీఎం అయ్యే వారా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి ఏం చేయలేదన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాజు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఐదు సంవత్సరాలుగా పట్టణంలో అన్ని వర్గాలకు దగ్గరవుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఆయన సూచనలు సలహాలు పాటిస్తూ రాజు ముందుకు సాగుతున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో కార్యకర్తలను, నాయకులను ఏకతాటిపైకి తెస్తూ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటున్నారు. అదేవిధంగా పేదలకు కార్యకర్తలకు ఆపద సంపదలో అండదండలు అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంకు వచ్చిన తర్వాత పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకపోయి పార్లమెంటు ఎన్నికల్లో పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు పార్టీ కోసం శ్రమిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు విజయానికి గత నెల రోజులుగా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు కార్యకర్తలు నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో ఓటింగ్ శాతం చేరికల వల్ల పెరిగే అవకాశం ఉందని, ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంలో రాజు ప్రత్యేక పాత్ర పోషించారు.

బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్



నవతెలంగాణ-గజ్వేల్

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందని నాచారం శేఖర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి ఒక్కరి హక్కు, బాధ్యత అన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వినియోగించుకునే ఓటు బాధ్యతగా వినియోగించుకొని మంచి నాయకున్ని ఎన్నుకొని అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ఓటు వేయడం నిర్లక్ష్యం చేస్తే అవినీతి రాజకీయ నాయకుడు అధికారంలోకొస్తే ఐదు సంవత్సరాలు ఏమీ అభివృద్ధి లేకుండా ఉండే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కాబట్టి భారతరాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 వయస్సు నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్యబద్ధంగా నాయకున్ని ఎన్నుకొని దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డబ్బులకి, ప్రలోభాలకి లోనూ కాకుండా నిజాయితీగా ఓటు వేయాలన్నారు.

రామకోటి సంస్థ బియ్యంతో ఈవీఎం



నవతెలంగాణ-గజ్వేల్ : ఓటు మన జన్మహక్కు అని గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వారు ఎన్నో చిత్రాలను చిత్రించి ప్రజలకు ఓటుపై అవగాహన కల్పిస్తుంది. సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసే ఈవీఎం మిషన్ చిత్రాన్ని బియ్యంతో అద్భుతంగా రూపొందించి తమ సందేశాన్ని ఇచ్చారు రామకోటి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్రస్థాయి కలారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు .

ఆలయ అన్నదాన సత్రంకు విరాళం



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయ అన్నదాన సత్రంకు ఆదివారం మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్‌కు చెందిన పులిపాక దేవమణి అర్జున్ దంపతులు రూ.1,00,116లు విరాళంగా ఇచ్చి మహారాజ పోషకులుగా శాశ్వత అన్నదాన పథకంలో సభ్యత్వం పొందారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు మహదేవుని మనోహర్, జూనియర్ అసిస్టెంట్ మధుకర్, బుకింగ్ క్లర్క్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ -నంగునూరు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 37 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నంగునూరు మండలంలో పురుషులు 15,451, స్త్రీలు 15,950, ట్రాన్‌జెండర్ 1, మొత్తం 31,402 ఓటర్లు ఉన్నారు. ఉదయం7.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఆదివారం పోలింగ్ సిబ్బంది నంగునూరు మండలానికి చేరుకున్నారు.

ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవేందర్



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామ శివారు శివాలి తండాకు చెందిన లకావత్ దేవేందర్ నాయక్ తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ, సంఘం సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట ఉద్యోగ ఉపాధి అవకాశాల కొరకు వారి హక్కులు రక్షించేందుకు పాటు పడతానని, ప్రజల ఆరోగ్య రక్షణ కొరకై సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేసిన అధికారులు

- పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు





నవతెలంగాణ-సిద్దిపేట

లోక్‌సభ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేసారు. సిద్దిపేట జిల్లాలో మెదక్ పార్లమెంటు పరిధిలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో హుస్నాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం ఉంది. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, పోలింగ్ సంబంధించిన వస్తువులను పట్టణంలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి అందించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, పోలీస్ కమిషనర్ అనురాధలు పంపిణీ కేంద్రాలను పరిశీలించి, అక్కడ ఏర్పాట్లను తెలుసుకున్నారు.

నియోజకవర్గాలుగా ఓటర్లు....

సిద్దిపేట నియోజకవర్గంలో 2,37,591 మంది ఓటర్లు ఉండగా, 1,16,436 మంది పురుషులు, 1,21,084 మంది మహిళలు, 71 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. కాగా ఇక్కడ 273 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దుబ్బాక నియోజకవర్గం 2,00,125 మంది ఓటర్లు ఉండగా, 97, 198 మంది పురుషులు, 1,02,927 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గజ్వేల్ నియోజకవర్గం లో 2,80,913 మంది ఓటర్లు ఉండగా, 1,38,186 మంది పురుషులు, 1,42,722 మంది మహిళలు, 5 ఇతర ఓటర్లు ఉన్నారు. 322 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో 2,47,701 మంది ఓటర్లు ఉండగా, 1,21,715 మంది పురుషులు, 1,25,981 మంది మహిళలు, 5 ఇతర ఓటర్లు ఉన్నారు. 304 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పిఒ, ఏపీవో, ఓపిఒ, మైక్రో అబ్జర్వర్లను అధికారులు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు

ఎండ తీవ్రత మూలాగా ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకుందాం

- బీజేపీ చేతిలో బంది అయిన భారతదేశాన్ని విముక్తి చేద్దాం
- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ- గజ్వేల్

భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సంద బోయిన ఎల్లయ్య కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపించాలన్నారు. కేంద్రంలో ఇండియా బ్లాక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా పని చేసిందని దళితులు మైనార్టీలు మహిళల మీద దాడులు పెరిగాయన్నారు. ధర్నాలు పోరాటాలపై కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంతో వ్యవహరించిందని ప్రజాస్వామ్యం లేకుండా చేసిందన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలైన ఈడి, ఎలక్షన్ కమిషన్, సిబిఐ, ఇన్కమ్ టాక్స్ స్వతంత్రంగా పని చేయకుండా చేసిందన్నారు. తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై ఈడి ఇన్‌కంట్యాక్స్, సీబీఐలను ఉపయోగించి కేసులు పెట్టించి జైల్లో వేసిందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించిన విద్యార్థులు మేధావులు మీడియాపై దేశద్రోహం, ఉపా చట్టం లాంటి కేసులు నమోదు చేసి సంవత్సరాల తరబడి జైల్లో ఉంచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బ్యాంకులు ఎల్ఐసి రైల్వే పోర్టులు రోడ్డు భారీ పరిశ్రమలు వేల కోట్ల రూపాయల విలువ గల ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టిందన్నారు. రిజర్వేషన్లు ఉండకూడదన్న దురుద్దేశంతో జనాభా లెక్కలు చేయలేదని బీసీ లెక్కలు చెప్పడం లేదన్నారు. ప్రజాస్వామ్యం కోసం, రాజ్యాంగం కోసం బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

గ్రామాలకు తరలిన ఎన్నికల సిబ్బంది

- మొత్తం ఓటర్లు 2,80,913
- మొత్తం పోలింగ్ కేంద్రాలు 322.



నవతెలంగాణ-గజ్వేల్

నేడు జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ నిర్వహించనున్న పోలింగ్ సిబ్బంది ఆదివారం గ్రామాలకు తరలి వెళ్లారు. గజ్వేల్ ఐఓసీ భవనంలో పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించి గ్రామాలకు ఈవీఎంలతో పోలింగ్ సిబ్బంది గ్రామాలకు తరలి వెళ్లారు. మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ పరిధిలో మొత్తం ఓటర్లు రెండు లక్షల 80 వేల 913 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులు 1,38,186 ఉండగా, మహిళలు 1,42,722 మంది ఉన్నారు. ట్రాన్స్ జెండర్ ఐదు ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో 322 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. ఇందుకు కావలసిన సిబ్బందిని ఆదివారం కేటాయించి గ్రామాలకు బస్సులో ద్వారా తరలించారు. అదేవిధంగా గ్రామాల్లో ఎలాంటి సమస్య ఎన్నికల సిబ్బందికి రాకుండా గత వారం రోజులుగానే ఆయా శాఖ అధికారులు ఎన్నికల నిబంధన ప్రకారం అన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరం, తాగునీటి సౌకర్యం, పోలీస్ సిబ్బంది, మహిళలకు పురుషులకు వేరువేరుగా ఏర్పాటు చేశారు. గజ్వేల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి బన్సీలాల్ ఎన్నికల సిబ్బందికి సూచన సలహాలు అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఏసిపి పురుషోత్తం రెడ్డి పలు సూచనలు సలహాలు పాటించాలని ఆయన చెప్పారు.

పార్లమెంట్ ఎన్నికలకు సర్వసిద్ధం

- సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



నవ తెలంగాణ- దుబ్బాక

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మెదక్ ఏఆర్ఓ, సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. ఓటు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో గల మోడల్ స్కూల్‌లో ఈవీఎం మిషిన్ల డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ అనంతరం సిద్దిపేట అదనపు ఏసీపీ మల్లారెడ్డి తో కలిసి మీడియాతో ఆమె మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలో 253 పోలింగ్ కేంద్రాలున్నట్లు, ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో నలుగురు ఎన్నికల అధికారులు, ఒక కానిస్టేబుల్, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లలో అదనంగా మరో ఇద్దరు కానిస్టేబుల్‌లను నియమించామన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి మున్సిపల్, రెవిన్యూ, విద్యాశాఖ, పోలీసు శాఖ, పారిశుద్ధ్య సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా యువకులదే

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువ నాయకులదేనని మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం అమ్మదిపూర్ గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకులు ఆకుల ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు సరోజిని, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అహ్మదీపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి ప్రభాకర్ కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులను ప్రోత్సహించాలని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన సలహాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఆకుల ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నర్సారెడ్డి నాయకత్వంలో గ్రామంలో అభివృద్ధి సాధించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, నక్క రేగొండ, రామచంద్ర చారి, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

- ముగిసిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు గత ఐదు రోజులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామి వారి కల్యాణం, శనివారం సాయంత్రం ఎండ్ల బండ్ల ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం రథోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు రంగనాయక స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్, గ్రామ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, ఎంపీటీసి చైతన్య శంకర్ రెడ్డి, గంగాపూర్-యూసుప్ ఖాన్ పల్లి సర్పంచ్ గడ్డం ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ భారతమ్మ, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, మొర్సు కరుణాకర్ రెడ్డి, సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ గీతా రాంరెడ్డి, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, కొండపోశమ్మ ఆలయ మాజీ డైరెక్టర్ మాదవరెడ్డి, వంటి మామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ప్రవీణ్ చారి, రమేష్ గుప్త, శ్రీనివాస్ గుప్త, మాజీ సర్పంచులు బబ్బూరి మల్లేశం గౌడ్,మొర్సు శ్రీనివాస్ రెడ్డి, సాయిని మహేష్,జి.గోపాల్ రెడ్డి,రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుర్వి బాలనర్సయ్య గౌడ్, వెంకట్ గౌడ్, బాలకృష్ణ గౌడ్, సంజీవరెడ్డి, సాయిరెడ్డి , బాపురెడ్డి, ఆకుల అనిల్, అన్నారం బాపురెడ్డి, పుట్ట ఆంజనేయులు, పుట్ట రవి, పాపోల్ల రాజు, నవీన్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రంగనాయక స్వామి భక్తులు గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు. ముదిరాజ్ సంఘం నాయకులు జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, బందారం రమేష్ గౌడ్, విజయ్ ముదిరాజ్, బొంగొని సత్యం గౌడ్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి యాదగిరి, పోతిరెడ్డి రమేష్ ముదిరాజ్, సచిన్ యాదవ్, యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్



నవ తెలంగాణ-రాయపోల్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లోకసభ ఎన్నికలలో తెలంగాణ ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో స్వచ్ఛందంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ పేర్కొన్నారు. లోకసభ ఎన్నికలలో వయోజనులందరూ ఏ ప్రాంతంలో ఉన్న ఎక్కడ ఉన్న తమ స్వగ్రామానికి చేరుకొని ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో పోరాటాలు చేసి భారత దేశంలో ఉన్న ప్రజలకు కులమతాలు, ధనిక పేద, స్త్రీ పురుషులు అని తేడా లేకుండా 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ ఓటు హక్కును కల్పించారని తెలిపారు. ఓటర్లు ప్రలోభాలకు తలోగ్గి ఓటును అమ్ముకుంటే ఐదు సంవత్సరాలపాటు మన భవిష్యత్తును అమ్ముకున్నట్లేనన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నారు.

అక్రమ మద్యం కలిగి ఉన్న ఇద్దరిపై కేసు



నవ తెలంగాణ - సిద్దిపేట

ఎన్నికల సందర్భంగా ఎక్కువ ధరలకు మద్యాన్ని అమ్మాలని దురాశతో మద్యాన్ని నిల్వచేసిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస మూర్తి తెలిపారు. ఉదయం 6 గంటలకు కాకతీయనగర్ వీధి నెంబర్ 6లో 18 గోవా మద్యం బాటిళ్ల (22.25 లీటర్లు), 667 తెలంగాణ మద్యం బాటిళ్ల (108 లీటర్లు), తెలంగాణకి చెందిన 225 బీర్ బాటిళ్ల పూల మల్లారెడ్డి , పూల అమరేందర్ రెడ్డిల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. సుంకం చెల్లించని ఇతర రాష్ట్రాల మద్యాన్ని కలిగి ఉండడం నేరమని హెచ్చరించారు. ఈ దాడులలో ఎస్‌హెచ్ఓ ఏ.శ్రీనివాస్, కె.శ్రీధర్, విజయ్, కిరణ్, హెడ్ కానిస్టేబుల్‌లు రవీందర్, అంజయ్య, చెన్నగౌడ్, సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, స్వామి,స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు పంచుతూ మాజీ సర్పంచ్ అరెస్టు



నవ తెలంగాణ-దౌల్తాబాద్

ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఆదివారం మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు తాజా మాజీ సర్పంచులు విపరీతంగా డబ్బులు పంచడంతో నమ్మదగిన సమాచారంతో ఎఫ్ ఎస్‌టి దౌల్తాబాద్ రాయపోల్ బృందం తనిఖీలను నిర్వహించారు. మండలంలోని ముబారస్ పూర్ గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ ఈదు గాని యాదగిరి, ఆయనతోపాటు బోటుక రాములు కలిసి ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఎఫ్ ఎస్‌టి దౌల్తాబాద్, రాయపోల్, తొగుట బృందం పట్టుకున్నారు. ఓటర్లకు పంచుతుండగా మరో రూ.3,100 పట్టుకొని స్థానిక ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్‌కు అప్పగించారు. ఎఫ్ ఎస్ టి దౌల్తాబాద్ రాయపోల్ అధికారుల ఫిర్యాదు మేరకు దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అభ్యర్థుల భవితవ్యం నమోదు చేయనున్న ఓటర్లు

కాంగ్రెస్ నాయకులు పంజాల రాజు గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మెదక్ ఎంపీ అభ్యర్థిలో మూడు ప్రధాన పార్టీల భవితవ్యం ఓటర్‌లు నమోదు చేయనున్నారని, గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజాల రాజు గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ లోక్ సభ స్థానానికి మూడు ప్రధాన పార్టీలు తలపడుతున్నాయన్నారు. ఇందులో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారాలు కొనసాగించారన్నారు. వారి భవితవ్యం ఓటర్లు నేడు ఓటు రూపంలో నమోదు చేయనున్నారు. ఏది ఏమైనా మెదక్ పార్లమెంట్ అభ్యర్థుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారన్నారు.ఇందుకుఓటర్లు హస్తం గుర్తుకు ఓటు వేసి అభ్యర్థిని గెలిపిస్తారని నమ్మకం ఉందని ఆశ భావవ్యక్తం చేశారు. ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవడంలో గజ్వేల్ ప్రజలు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తారని గుర్తుకు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ,ప్రజల ప్రభుత్వం అన్నారు.

జాతి కోసం ఓటు!!

జాతీ కోసం అంగలార్చే
జాన పదుడా!
జాతికి జవజీవం
నీ ఓటు కాదా!
ప్రశ్నించే గుణం కాదు
ఓటు వేసే బాధ్యత ముఖ్యం!
అక్రమార్కుల ఆటలు కట్టే
ఆయుధం నీ ఓటే సుమా!
బలవంతుల భరిగీసి
దునుమాదే అస్త్రం నీవు!
క్షణం యెమరుపాటు
కాకూడదు నిర్లక్ష్యం!
ఐదేళ్ళ ప్రగతి నిర్దేశం
నీ నిర్భయ నిర్ణయం!
కాలంతో కలిసి పోకు
గిరి గీసి పోటు వేయు!
దోచుకునే తోడేళ్లను
పొలిమేర దాటించు!
అలసత్వం వద్దు
అప్రమత్తం మిత్రమా!
బోర్డర్ సైనికుడి వలే
బ్యాలెట్ వీరుడిగా
నినదించు!
ప్రజాస్వామ్య కేతనాన్ని
ప్రపంచానికి శిరమెత్తి
చూపించు!

డా. పూసల లింగాగౌడ్
సంగారెడ్డి : 9441424199

